సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఉదయం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చకులు శ్రీనివాస్ పంచామృతాభిషేకం, భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి పసుపునీళ్లతో భక్తులు మరోమారు జలాభిషేకం చేశారు. ప్రత్యేక పూలతో అలంకరణ అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ముత్యాల వస్త్రధారణలో అమ్మవారి దర్శనం

దాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని ముత్యాల వస్త్రధారణలో గురువారం అలంకరించనున్నారు. దేవాలయ ప్రాంగణంలో 250 మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు.

రౌడీషీటర్ వీరంగం

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధి శ్రీనగర్‌కు చెందిన గోపి అనే రౌడీషీటర్ వీరంగం సృష్టించాడు. వివరాలిలా.. జీవీఎంసీ 27వ వార్డు శ్రీనగర్‌లో నివసిస్తున్న ఈతలపాక గోపి అనే రౌడీషీటర్ బుధవారం అదే ప్రాంతానికి చెందిన వ్యక్తిని కొట్టాడు. స్థానికులు అందించిన సమాచారంతో ద్వారకా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విశేషంగా నిత్యకల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు కుమారాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేడుకగా రాపత్తు ఉత్సవాలు



వామనుడి అలంకరణలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు బుధవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వామనుడిగా దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వామనుడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అధిష్ఠింపజేశారు. ఆళ్వారులను వేరే పల్లకీలో వేంచేయజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
✆ 7997958342, 9912440606



సుందరీకరణలో భాగంగా నగర నడిబొడ్డున ఉన్న డైమండ్ పార్కు కొత్త హంగులు సంతరించుకుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విజన్‌ను అనుసరించి అధికారులు ఈ పార్కును అందంగా తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలు, పచ్చదనం సమకూర్చడంతో ఈ పార్కుకు సందర్శకుల రద్దీ బాగా పెరిగింది. ప్రభుత్వం ఇటీవల చేసిన ఆధునికీకరణ పనులు సంతృప్తినిస్తున్నాయని సందర్శకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



డైమండ్ పార్కు ప్రధాన ద్వారం

- పిల్లలు, పెద్దలను ఆకట్టుకుంటున్న డైమండ్ పార్క్
- నగర సుందరీకరణలో భాగంగా పార్క్‌కు నూతన హంగులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఆరోగ్యంగా.. ఆహ్లాదంగా



పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు



మొక్కలు నాటుతున్న అడిషనల్ కమిషనర్ నల్లనయ్య (ఫైల్)



పార్కులో పచ్చదనం

సీతమ్మధార : అందాల విశాఖ నగరానికి మరింత వన్నె తెచ్చేలా డైమండ్ పార్కు ఏర్పాటు చేశారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పార్కు డైమండ్ ఆకారంలో ఉండటం వల్ల దీనికి ఆ పేరొచ్చిందని పెద్దలు చెబుతుంటారు. గతంలో కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన హరినారాయణ ఆదేశాల మేరకు అప్పటి జోనల్ కమిషనర్ పల్లి నల్లనయ్య రూ. 27 లక్షలతో పార్కు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ పార్కులో మధ్యాహ్నం విద్యార్థులు, పర్యాటకులతో సందడిగా ఉంటుంది. ఇక్కడ విద్యార్థులు చదువుకుంటారు.. బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లు వ్యాపార సమావేశాలు ఏర్పాటు చేసుకుంటారు. పెద్దలు ఆరోగ్యం కోసం యోగా, వాకింగ్ చేస్తారు. ఈ నేపథ్యంలో డైమండ్ పార్క్ ఎప్పుడూ సందడిగా ఉంటుంది.

సరికొత్త హంగుల ఏర్పాటు..

జీవీఎంసీ 27వ వార్డు పరిధిలోకి వచ్చే డైమండ్ పార్కులో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విజన్‌ను అనుసరించి నగర సుందరీకరణలో భాగంగా ఎన్నో హంగులు ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట స్థలం, జిమ్, చిన్నారులు ఆడుకునేందుకు వివిధ రకాల టాయ్స్‌ను అధికారులు ఇక్కడ పొందుపరిచారు.

ఇటీవల ఇక్కడ ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వ్యాయామం చేసేందుకు పలు రకాల జిమ్ పరికరాలు కూడా ఏర్పాటు చేశారు. జీవీఎంసీ జనరల్ ఫండ్ నుంచి నిధులు విరివిగా ఖర్చు చేసి ఆధునికీకరించారు.

నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ..

డైమండ్ పార్కులో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. డైమండ్ పార్కు వాకర్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే, పండగలు నిర్వహిస్తుంటారు.

దత్తత తీసుకున్న ఏఐఎన్‌యూ ఆస్పత్రి..

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ సూచనల మేరకు డైమండ్ పార్కును ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ ఆస్పత్రి యాజమాన్యం దత్తత తీసుకుంది.

డైమండ్ పార్కు హైలైట్స్ ఇవీ..

- రూ. 27 లక్షలతో పూర్తి చేసిన ఆధునికీకరణ పనులు
- మరో రూ. 10 లక్షలతో ఏర్పాటు కానున్న ఆర్నమెంటల్ లైట్స్
- పార్కు రక్షణకు సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- పార్కులో ప్రవేశానికి ఐదు ఎంట్రీ ద్వారాలు
- పోటీ పరీక్షలకు చదువుకునే ఏర్పాటు
- ఇటీవల పార్కులో పెరిగిన పచ్చదనం
- 13 తడి-పొడి చెత్త డస్ట్‌బిన్‌ల ఏర్పాటు
- మార్కెటింగ్ సంస్థల సమావేశాలు ఇక్కడే
- కవులు, రచయితలు, నటుల ఇష్టాగోష్టికి చక్కని వేదిక



సీసీ కెమెరాలు

ప్రతిరోజూ సందడే..



డైమండ్ పార్కు ప్రతిరోజు పర్యాటకులు, స్థానికులు, పిల్లలతో సందడిగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం ఇక్కడ వాకింగ్‌తో పాటు జిమ్ చేస్తుంటారు. యోగా తరగతులు కూడా ఇక్కడ నిర్వహిస్తున్నారు. పార్కులో మొక్కల్ని పర్యవేక్షిస్తుంటాను.

– గురువులు, సెక్యూరిటీ గార్డు, డైమండ్ పార్క్

ప్రశాంతతకు నిలయం..

డైమండ్ పార్కులో ప్రశాంతంగా ఉంటుంది. పచ్చదనం వల్ల ఆహ్లాదకర వాతావరణం వెల్లివిరుస్తుంటుంది. వాకింగ్, వ్యాయామం, యోగా చేసేవారు ఎక్కువగా వస్తుంటారు. ఇటీవల ప్రభుత్వం పిల్లలు, పెద్దవాళ్లు ఎక్సర్‌సైజ్‌లు చేసుకునేందుకు చక్కటి పరికరాలు ఏర్పాటు చేసింది. ఉదయం, సాయంత్రం పార్కులో పిల్లలు, పెద్దవాళ్లతో ఒకటే సందడిగా ఉంటుంది.

– అంగటి కుమారి, గృహిణి

ఏవీఎన్‌లో ముగిసిన ఆహ్వాన్ ఫెస్ట్-2023



బీఎస్ రెడ్డిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

దాబాగార్డెన్స్ : నిత్యం పాఠ్యాంశాల బోధన, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసే విద్యా సంస్థలో కళలు, క్రీడలతో సందడిగా మారింది. ఆటపాటలతో అలరించడం ప్రత్యేకంగా నిలిచింది. బాలీవుడ్ హీరోయిన్, సినీ హీరోయిన్, సినీ డైరెక్టర్, టీవీ కళాకారులు.. విద్యార్థులను తొలి రోజు మంత్రముగ్ధులను చేయగా.. ఇంద్రజాల ప్రదర్శనతో రెండో రోజు విద్యార్థులు పులకించారు. ఏవీఎన్ కళాశాలలో గత రెండు రోజులుగా నిర్వహించిన ‘ఆహ్వాన్ ఫెస్ట్-2023’ రెండో రోజు బుధవారంతో ముగిసింది. ఫెస్ట్‌లో భాగంగా ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. విద్యార్థుల్లో నూతనోత్సాహానికి ఆహ్వానం పలికారు. ప్రముఖ సినీ నటుడు, జీవీఎంసీ బ్రాండ్ అంబాసిడర్ ఇనుగోలు ప్రసన్నకుమార్, బాలీవుడ్ హీరోయిన్ అవికాగోర్, జబర్దస్త్ ఫేమ్ బుల్లెట్ భాస్కర్ సందడితో కళాశాల ప్రాంగణం నిండింది. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ ఇంద్రజాలికుడు బీఎస్ రెడ్డి ఇంద్రజాల కళలో తనకున్న ప్రావీణ్యతను ప్రదర్శించి ఆద్యంతం ఆకట్టుకున్నారు. ఏవీఎన్ కళాశాలలో చదువుకోవడం తన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ అదీప్ భానోజీరావు మాట్లాడుతూ తమ పూర్వీకుల కాలం నుంచి ఏవీఎన్ కళాశాల ఉత్తరాంధ్ర జిల్లాలకే పరిమితం కాకుండా, ఇతర ప్రాంతాలకు చెందిన వారికి విద్య అందిస్తుందని, కళాశాలకు ఉన్న చారిత్రక నేపథ్యాన్ని గుర్తు చేసుకుంటూ విద్యారంగ అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. ఏయూ ప్రొఫెసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకూడదని, వివిధ రంగాల్లో రాణించాలంటే పోటీతత్వంతో ముందుకు సాగాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, శంకర్‌నారాయణ, మీడియా కో ఆర్డినేటర్ పైడి రజని, స్వరాజ్యలక్ష్మి, గాంధీ, సంతోషి, రామ్‌కుమార్, మహాలక్ష్మి, లావణ్య, ఇందిర, సుమలత, మల్లిక, అర్చన కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సుస్థిర రాజ్యాంగంతోనే ప్రజాస్వామ్య మనుగడ

దాబాగార్డెన్స్ : ప్రజాస్వామ్యంలో సిటిజన్స్ పాత్రపై బుధవారం త్రిసభ్య కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ప్రొఫెసర్ ప్రసన్నకుమార్, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎల్‌వీ సుబ్రహ్మణ్యం మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా పని చేస్తేనే ప్రజాస్వామ్య మనుగడ అని పేర్కొన్నారు. ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా పని చేస్తేనే ప్రజాస్వామ్యం వికసిస్తుందని చెప్పారు. మాజీ ఎన్నికల అధికారి, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా స్వచ్ఛంగా తయారు కావాలన్నారు. ప్రముఖ రాజనీతి శాస్త్ర ఆచార్యుడు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ అసాధ్యాలను సుసాధ్యం చేయగల నాయకుడే నిజమైన రాజకీయ నాయకుడని చెప్పారు. విశాఖ రాజధాని కావాలని తామెవ్వరం కోరుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ సభ్యులు రిటైర్డ్ డీజీపీ ఎంవీ భాస్కరరావు, పూర్వ అడిషనల్ అడ్వకేట్ జనరల్ సత్యప్రసాద్, రిటైర్డ్ హిందూ రెసిడెంట్ ఎడిటర్ కె. వెంకటేశ్వర్, రాజేంద్రప్రసాద్, వీఎస్‌ఆర్‌కే ప్రసాద్, ప్రొఫెసర్లు ఎస్. రామకృష్ణ, బోడేపూడి ప్రసాదరావు, హరికిషన్, ఉమామహేశ్వరరావు ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కార్యదర్శి డి. సోమసుందరం తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనం పార్కు ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్-1లో ప్రకృతి వనం పార్కును స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ బుధవారం ప్రారంభించారు. విభాగంలో ఉన్న పాత డంపింగ్ యార్డును ఉద్యోగులు ఇతర విభాగాల సహకారంతో పార్కుగా అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా సీఎండీ భట్ మాట్లాడుతూ విభాగంలోని స్క్రాప్‌ను వినియోగించి అందమైన పార్కుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన తరంగ్ వాటర్ ఫౌంటెన్‌ను, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) బాగ్చీ లెహార్ ఫౌంటెన్‌ను ప్రారంభించారు. పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) ఎన్.వి. స్వామి, ఇతర సీజీఎంలు ఎ.కె. సోఢీ, యు.శ్రీధర్, ఎస్.ఎం.ఎస్ విభాగం సీజీఎం పి.ఎస్.రావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

30న విగ్రహాల ఆవిష్కరణ



విగ్రహాల ఆవిష్కరణ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

పెదగంట్యాడ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఈ నెల 30న పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ సెంటర్‌లో ఆవిష్కరించనున్నామని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గంట్యాడ గురుమూర్తి, మార్టుపూడి పరదేశి తెలిపారు. విగ్రహాల ఆవిష్కరణకు సంబంధించిన పోస్టర్‌ను దుర్గవానిపాలెం కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ విగ్రహాలను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, బాపట్ల ఎంపీ నందిగామ సురేష్, మంత్రులు తానేటి వనిత, మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు తదితరులు ఆవిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో గంట్యాడ గోవిందరాజు, సోమునాయుడు, పైడిరాజు, పెంటారావు, రాములు, వెంకట్రావు, డాక్టర్ ఎస్.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు



కోలాటం ఆడుతున్న వరాహ నరసింహ భజన మండలి సభ్యులు



కనకమహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో మిమిక్రీ చేస్తున్న కాకినాడకు చెందిన బాబూరావు



కోలాటం ఆడుతున్న మహిళలు

అల్లిపురం : ధనుర్మాసోత్సవాలలో భాగంగా బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా బుధవారం సాయంత్రం మండపంలో వరాహ నరసింహ భజన మండలి అధ్యక్షురాలు వబ్బిలిశెట్టి రాధిక ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కోలాటం బృందానికి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.

మురిపించిన మిమిక్రీ..

దాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాలను పురస్కరించుకుని ధర్మప్రచార కార్యక్రమంలో భాగంగా కనకమహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన మిమిక్రీ భక్తులను మురిపించింది. పి. విజయ బృందంచే చేపట్టిన కోలాటం భక్తులను ఆకట్టుకోగా, కాకినాడకు చెందిన బాబూరావు చేసిన మిమిక్రీ భక్తులను అలరించింది. ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం నగరానికి చెందిన సాయిభారతి కూచిపూడి అకాడమీకి చెందిన కె. యలజాక్షిచే కూచిపూడి నృత్యం ఏర్పాటు చేసినట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు.

మిద్దె తోటల పెంపకం అవసరం



మహిళలకు మొక్కలు అందజేస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ: విశాఖను హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు మిద్దె తోటల పెంపకం అవసరమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో 13వ వార్డులో బుధవారం మిద్దె తోటల పెంపకంపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ కెల్ల సునీత, జోన్-2 అధికారులతో కలిసి ఆమె స్థానిక మహిళలకు మొక్కలు, విత్తనాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మేయర్ మాట్లాడుతూ ఎకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా ఎకో గ్రీన్ అంశంపై టెర్రాస్ గార్డెన్లు అభివృద్ధి చేయాలన్నారు. అపార్ట్‌మెంట్లు, భవనాలపైన, గేటెడ్ కమ్యూనిటీల వద్ద మిద్దె తోటలు పెంచాలని సూచించారు. పచ్చదనం ఇచ్చే మొక్కలతోపాటు ఆకుకూరలు, కూరగాయల మొక్కలు కూడా పెంచుకోవచ్చన్నారు. వీటికి సంబంధించిన 12 రకాల విత్తనాలు ఏవిధంగా వినియోగించాలి, 12 రకాల మొక్కలను ఏవిధంగా పెంచాలో ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. అపార్ట్‌మెంట్లలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు పెంచాలని మేయర్ కోరారు. కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి, యూసీడీ ప్రాజెక్టు ఆఫీసర్ డి.లక్ష్మి, డీపీవో ప్రసాద్, ఎస్‌ఆర్‌యూ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మిజోరం గవర్నర్ రాక నేడు

మహారాణిపేట: మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు ఈ నెల 28న విశాఖ వస్తున్నారు. న్యూఢిల్లీ నుంచి ఇండిగో విమానంలో గురువారం రాత్రి 7.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి దసపల్లా హిల్స్‌లో తన నివాసానికి చేరుకుని రాత్రికి బస చేస్తారు. 29 నుంచి 3వ తేదీ వరకు గవర్నర్ డ్యూటీ నుంచి డిశ్చార్జ్ అవుతారు. జనవరి 4న ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి బయలుదేరి విశాఖ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగే ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొని.. తిరిగి ఇంటికి చేరుకుంటారు. 5న డ్యూటీ నుంచి డిశ్చార్జ్ అవుతారు. 6న ఉదయం 7.15 గంటలకు రాజమహేంద్రవరం వెళతారు. సాయంత్రం 5 గంటలకు తిరిగి విశాఖలోని తన ఇంటికి చేరుకుంటారు. 7న రాత్రి 7 గంటలకు ఇంటి నుంచి విమానాశ్రయానికి చేరుకుని.. అక్కడి నుంచి విజయవాడ వెళ్తారు.

క్షేత్రస్థాయి అభ్యసనే మేలు

బీచ్‌రోడ్డు: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచడానికి క్షేత్రస్థాయి అభ్యసన దోహదపడుతుందని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ఎండీ షేక్ షిరీన్ బేగం అన్నారు. బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో స్కాలాస్టిక్-ఎడ్యు-డిపోట్(ఎస్ఈడీ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఫిజిక్స్ పరికరాల ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు విద్యా బోధన సులభతరంగా ఉండేందుకు సైన్స్ పరికరాలు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి అవగాహన కల్పిస్తే శాశ్వతంగా గుర్తుండిపోతుందని సూచించారు. ఈ ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంస్థ చైర్మన్ ఎస్ఎం రెహమాన్, డైరెక్టర్లు సయ్యద్ ఖగీముద్దీన్, అన్వర్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం తిరుప్పావై సేవాకాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఉద్యోగార్థులకు క్విజ్ పోటీ



మొదటి బహుమతి సాధించిన విద్యార్థులతో క్విజ్‌మాస్టర్ సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం ఉద్యోగార్థులకు గ్రూప్-2 పరీక్షల ప్రణాళిక ఆధారంగా వివిధ అంశాలపై క్విజ్ పోటీ నిర్వహించారు. 50 మంది విద్యార్థులు ఏడు బృందాలుగా పాల్గొన్నారు. ఏడు రౌండ్లలో జరిగిన పోటీలో గెలిచిన విజేతలకు పుస్తకాలను బహుమతిగా ప్రదానం చేశారు. గ్రంథాలయ సహ కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు.

కరాటేలో పతకాల పంట

గాజువాక : ఈ నెల 22 నుంచి 26 వరకు పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన 23వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విశాఖకు చెందిన చిన్నారులు సత్తా చాటారు. కెన్యు ర్యు కరాటే అసోసియేషన్ ద్వారా ఈ పోటీలకు హాజరైన 34 మంది విద్యార్థులు కాటా, కుమిటీ విభాగాల్లో 48 బంగారు పతకాలు, 14 రజత పతకాలు, 6 కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. జాతీయ కోచ్ కోరాడ సుమన్, కోచ్‌లు ధనుంజయ్, శివ ప్రసాద్ ఆధ్వర్యంలో చిన్నారులు ఈ పోటీలకు హాజరయ్యారు. పతకాలు సాధించి, విశాఖకు తిరిగి వచ్చిన బాల బాలికలను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
✆ 9010810033, 7075989701
Office mail : sakshiadvtvsp@gmail.com